
క్లుప్తంగా

బాబామందిరంలో విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో షిర్డీసాయిబాబా

పొదలకూరు: పట్టణంలోని శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో గురువారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం బాబాకు అభిషేకాలు, అలంకరణ, అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం భక్తులు బాబా భజనలు చేశారు. రాత్రి స్వామివారికి పల్లకిసేవ నిర్వహించారు. భక్తులు బాబాను దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

గోదాము తనిఖీ


గోదాములో నిల్వలను తనిఖీ చేస్తున్న పౌరసరఫరాలశాఖ అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక పౌరసరఫరాలశాఖ గోదామును జిల్లా మేనేజర్ వెంకటేశ్వర్లు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరసరఫరాలశాఖ పరంగా జిల్లాలో అక్కడక్కడా కొన్ని ఆరోపణలు రావడంతో ఈ తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో ఎలాంటి వ్యత్యాసాలు లేవని, అన్నీ రికార్డుల మేరకు నిల్వలు ఉన్నాయని తెలిపారు. పౌరసరఫరాలశాఖకు సంబంధించి ఎలాంటి ఆరోపణలు ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్ ఇబ్రహీం, డిప్యూటీ తహసీల్దార్ మురళి ఉన్నారు.

గుండాలమ్మపాళెంలో 'ఫ్యామిలీ డాక్టర్'


వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది


కొడవలూరు: మండలంలోని గుండాలమ్మపాళెం ఎస్సీకాలనీలో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఓపీ నిర్వహించి పలువురికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఇద్దరు గర్భిణుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయడంతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి బాలచంద్రబాబు, హెచ్ఎస్ ఎస్.సుజాత, ఎంఎల్‌హెచ్‌పీ షేక్ రషీద, హెచ్ఏలు ఎస్కే షఫీఉద్దీన్, బి.విజయలక్ష్మి, ఆశా కార్యకర్త పి.శైలజ పాల్గొన్నారు.

ఐసీఏఐ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక


బాధ్యతలు స్వీకరిస్తున్న హరిశంకర్

నెల్లూరు(బారకాసు): ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలను నగరంలోని ఐసీఏఐ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐసీఏఐ మాజీ అధ్యక్షుడు దేవరాజురెడ్డి హాజరయ్యారు. ఐసీఏఐ జిల్లా చైర్మన్‌గా హరిశంకర్, వైస్ చైర్మన్‌గా యువరాజేష్, సెక్రటరీగా సుధామహేష్, ట్రెజరర్‌గా బాలఓబులు, విద్యార్థి విభాగ చైర్మన్‌గా అరుణ్‌కుమార్, మెంబర్‌గా వెంకటమాధురి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఘనంగా త్యాగరాజ స్మరణోత్సవాలు



నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలో త్యాగరాజ స్మరణోత్సవాలను భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో వేడుకగా నిర్వహిస్తున్నారు. మహావిష్ణువు అలంకారంలో స్వామివారు కొలువై భక్తులను కటాక్షించారు. చెన్నైకి చెందిన ప్రముఖ విద్వాంసుడు సునీల్ గార్గేన్ తన సుమధుర గాత్రంతో అలరించారు. లక్ష్మీభట్, విజయగణేషన్ (వయోలిన్), శ్రీరామ్ (మృదంగం), సాయినాథ్ (ఘటం) వాద్య సహకారం అందించారు. కథకులు భవానీబాయి భాగవతారిణితో ద్రౌపది స్వయంవరం, నాగమణి భాగవతారిణి కృష్ణరాయబార హరికథా గానం చేశారు. అనంతరం ఔత్సాహిక కళాకారులతో గాత్ర, వీణ కచేరీలను జరిపారు. కమిటీ అధ్యక్ష, శాశ్వత కార్యదర్శులు శ్రీరామ్మూర్తి, నాగదేవీప్రసాద్, తదితరులు పర్యవేక్షించారు.

దిగజారుతున్న నిమ్మధరలు

- పెరిగిన ఎగుమతులు
- ధరలు తగ్గడంతో రైతుల డీలా


పొదలకూరు యార్డుకు వచ్చిన నిమ్మకాయలు

పొదలకూరు: నిమ్మధరలు దిగజారుతున్నాయి. నిన్నటి వరకు బస్తా నిమ్మకాయల ధర అధికంగా రూ.7,500 పలకగా, రెండు రోజుల నుంచి ధర తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం బస్తా రూ.4 వేల నుంచి రూ.5,500 వరకు ధర పలుకుతున్నట్లు వ్యాపారులు తెలిపారు. ఇదే ధర కిలోల వంతునైతే కేజీ రూ.60 నుంచి రూ.70 వరకు పలికింది. వేసవిలో ఒక్కసారిగా రూ.2 వేల వరకు ధరలు తగ్గిపోవడంతో రైతులు డీలా పడ్డారు. కాయల ఎగుమతులు పెరగడం వల్లనే ధరలు తగ్గుముఖం పడుతున్నట్లు వ్యాపారులు వెల్లడించారు. అయితే ప్రస్తుతం ఉన్న ధరలు తక్కువేమీ కాకున్నా నిలకడగా ధరలు ఉంటాయనే నమ్మకం సన్నగిల్లుతోందని రైతులు చెబుతున్నారు. నిమ్మ ధరలను శాసించే ఢిల్లీ మార్కెట్‌కు వివిధ ప్రాంతాల నుంచి ఎగుమతులు పెరగడం వల్ల ధరల్లో వ్యత్యాసం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే గతేడాది డిసెంబర్ నుంచి నిమ్మ మార్కెట్ పుంజుకున్నా మూడు మాసాలే రైతులు పెరిగిన నిమ్మ ధరలతో ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. ప్రస్తుతం రైతుల తోటల్లో కాయల దిగుబడి పెరుగుతున్నాయి. మార్చి రెండో వారంలో కూడా కాయలు దిగుబడి అయిన రైతులకు గిట్టుబాటు ధరలు లభించాయి. కొంత ఆలస్యంగా కాయల దిగుబడి అవుతున్న రైతులకు ధరలు గిట్టుబాటు అవుతాయో లేదో వేచి చూడాల్సి ఉంది.

వేసవిలో డిమాండ్

వేసవి తాపం పెరిగే కొద్దీ నిమ్మకాయలకు డిమాండ్ పెరుగుతుంది. సాధారణంగా ఏప్రిల్ మాసంలో విక్రయించాల్సిన ధరలు మార్చిలోనే అమ్మడం రైతులకు కొంతవరకు ఊరట కలిగించే విషయం. కాయల ఎగుమతులు తగ్గితే తిరిగి ధరలు పెరిగే అవకాశం ఉంటుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. దీనికితోడు వర్షసూచన ఉన్నందున ఢిల్లీ మార్కెట్ వ్యాపారులు కాయల ఎగుమతి తగ్గించాల్సిందిగా పేర్కొంటున్నారు. దీంతో ఇక్కడి వ్యాపారులు కాయలకు డిమాండ్ తగ్గినందున ధరలు తగ్గిస్తున్నట్లు తెలుస్తోంది.

'మోసపోయాం.. న్యాయం చేయండి'

- మొగళ్లూరు పొదుపు మహిళల వేడుకోలు
- ఏపీఎంకు ఫిర్యాదు చేసిన బాధితులు


కార్యాలయం వద్ద మాట్లాడుతున్న బాధిత పొదుపు మహిళలు

పొదలకూరు: గత ప్రభుత్వ హయాంలో స్త్రీనిధి నుంచి రుణాలు తీసుకుని తిరిగి చెల్లించినా జమ చేయని ఉద్యోగుల వల్ల తాము మోసపోయామని, తమకు న్యాయం చేయాలని మండలంలోని మొగళ్లూరు పొదుపు సంఘాల మహిళలు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో ఏపీఎం రోజ్‌మేరీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధిత మహిళలు మాట్లాడుతూ గతంలో కార్యాలయంలో మొగళ్లూరు క్లస్టర్ సీసీగా పనిచేసిన వ్యక్తి గ్రామంలో పది సంఘాలకు స్త్రీనిధి నుంచి రుణాలను ఇప్పించి తిరిగి చెల్లించే ప్రక్రియలో నిధులను స్వాహా చేసినట్లు ఆరోపించారు. తాము సీసీకి అందజేసిన లక్షలాది రూపాయల నగదును చెల్లించకుండా స్వాహా చేయడంతో, ఇపుడు తాము బకాయిలు ఉన్నట్లు అధికారుల నుంచి ఒత్తిడులు వస్తున్నాయని వాపోయారు. తమ గ్రామంలోనే పది సంఘాల ద్వారా రూ.7.50 లక్షల నగదును స్వాహా చేశాడని, మిగిలిన గ్రామాల్లో విచారణ నిర్వహిస్తే మొత్తం వ్యవహారం బయటపడుతుందని తెలిపారు. కూలీనాలీ చేసుకుని జీవించే తాము ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు పొదుపు సంఘంలో సభ్యులుగా చేరామని, రుణాలు తీసుకుని తిరిగి చెల్లించే ప్రక్రియలో మోసపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతస్థాయి అధికారులు సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. గతంలో ఉన్న ఏపీఎంలకు కూడా తమకు జరిగిన అన్యాయాన్ని వెల్లడించినా ప్రయోజనం లేకుండాపోయిందన్నారు.

బాధితుల స్టేట్‌మెంట్ రికార్డు

బాధిత మహిళల నుంచి ఏపీఎం రోజ్‌మేరీ స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. వారి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించి వారు చెప్పిన వివరాలను రికార్డు చేసి ఉన్నతస్థాయి అధికారులకు సమర్పిస్తామన్నారు. పొదుపు మహిళలకు వీలైనంత త్వరగా న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామని తెలిపా. 2014 నుంచి ఈ ప్రక్రియ జరిగినట్లుగా బాధితులు పేర్కొన్నారు.

కాటాలకు అనుమతులు తప్పనిసరి


కాటాలకు ముద్రలు వేస్తున్న అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం: వివిధ దుకాణాలు, చేపలు, మాంసం మార్కెట్లు, పండ్ల దుకాణాల్లో ఉన్న కాటాలకు అనుమతులు తప్పనిసరి అని తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ సాయిశ్రీకర్ తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలోని పలు దుకాణాల్లో కాటాలకు గురువారం ముద్రలు వేయడంతోపాటు ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో వివిధ దుకాణాలు, మాంసం, చేపల మార్కెట్‌లో ఉన్న ఎలక్ట్రానిక్ కాటాలు, రాళ్లు, కాటాల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని తెలిపారు. దీంతో ఇటీవల దాడులు చేసి 20 కాటాలను సీజ్ చేసినట్లు తెలిపారు. కాటాలు ఉన్న ప్రతి ఒక్కరూ తమ వద్ద శాఖాపరమైన ముద్రలు వేయించుకుని, ధ్రువీకరణ పత్రాలు పొందాలని తెలిపారు. రాళ్ల కాటాలకు ఈ ధ్రువీకరణ పత్రం రెండు సంవత్సరాల వరకు కాలపరిమితి ఉంటుందని తెలిపారు. కాటాలకు ముద్రలు, ధ్రువీకరణ పత్రాలు లేకుండా వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలుదారులు కూడా కాటాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

వెంకటాచలం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలకు మొత్తం 174 మంది విద్యార్థులకు గాను, 170 మంది విద్యార్థులు హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

20 మంది విద్యార్థుల గైర్హాజరు

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక డీఎల్ఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 20 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణాధికారి కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 487 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా అందులో 20 మంది హాజరుకాలేదని తెలిపారు.

బైక్ అదుపుతప్పి..

వెంకటాచలం: బైక్ అదుపుతప్పి పడిపోయి వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. నెల్లూరు నగరానికి చెందిన మున్వర్ బాషా పనినిమిత్తం బైక్‌పై కసుమూరుకు వచ్చాడు. తిరిగి నెల్లూరుకు వెళుతుండగా కసుమూరు పంచాయతీ చింతలపాళెం వద్ద గేదెలు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో మున్వర్‌బాషాకు గాయాలు కాగా చికిత్సనిమిత్తం నెల్లూరుకు తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపముఖ్యమంత్రిని కలిసిన గొల్లపల్లి


ఉపముఖ్యమంత్రి నారాయణస్వామికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విజయ్‌కుమార్

ఇందుకూరుపేట: ఉప ముఖ్యమంత్రి కె.నారాయణ స్వామి, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనిని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డితో కలిసి విజయవాడలోని ఉపముఖ్యమంత్రి, మంత్రి కార్యాలయాలకు వెళ్లిన విజయ్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి చైర్మన్ పదవి వచ్చేందుకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వీరి వెంట ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు ఉన్నారు.

పంటకోత ప్రయోగంతో దిగుబడి అంచనా


కొడవలూరులో పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు

కొడవలూరు: కొడవలూరులో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి మాట్లాడుతూ పంట కోత ప్రయోగాల ద్వారా దిగుబడులను అంచనా వేయవచ్చని తెలిపారు. పంట నష్టాలు సంభవించినప్పుడు ఆ దిగుబడులను ప్రామాణికంగా తీసుకొని నష్టపరిహారం చెల్లించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఓ రమాగాయత్రి, వీఆర్వో రఘు, వీఏఏ కవిత, బీమా ఏజంట్ ఉమ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత



తోటపల్లిగూడూరు: మండలంలోని తోటపల్లిగూడూరు గ్రామానికి చెందిన ఒరందూరు హేమకుమార్ కుటుంబానికి విద్యా ఫౌండేషన్ ప్రతినిధులు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. హేమకుమార్ ఇటీవల పక్షవాతానికి గురై మంచానికి పరిమితమయ్యాడు. ఈ విషయం తెలుసుకొన్న ఫౌండేషన్ ప్రతినిధులు నాలుగు రోజుల క్రితం రూ.10 వేల ఆర్థికసాయం అందించగా, గురువారం ఆ కుటుంబానికి నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో విద్యా ఫౌండేషన్ ప్రతినిధి శ్రీపతి రాము, సభ్యులు క్రిమస్, భవానీశంకర్, శాంతివర్ధన్, పవన్, దానియేల్, కెవిన్, జశ్వంత్, సందీప్, అఖిల్, తనయ్ తదితరులు పాల్గొన్నారు.

డీపీఓలో హెడ్ కానిస్టేబుల్ వీరంగం

నెల్లూరు(క్రైమ్): మినిస్టీరియల్ సిబ్బందిపై మద్యం మత్తులో ఓ హెడ్ కానిస్టేబుల్ వీరంగం చేసిన ఘటన జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. ఏఎస్‌పేట పోలీస్‌స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న జేమ్స్ మద్యం మత్తులో జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చారు. తన ప్రమోషన్, ఇంక్రిమెంట్ల విషయమై అక్కడి మినిస్టీరియల్ సిబ్బందితో గొడవపడ్డారు. దీంతో బాధిత సిబ్బంది జరిగిన విషయాన్ని పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు దర్గామిట్ట పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారని సమాచారం.

అమరజీవికి ఘన నివాళి


తోటపల్లిగూడూరు: సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములుకి నివాళి


ఇందుకూరుపేట: గాంధీ ఆశ్రమంలో..

కొడవలూరు: భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలను అర్పించిన అమరజీవి పొట్టిశ్రీరాములు చిరస్మరణీయులని ఎంఈఓ జి.వసంతకుమారి కొనియాడారు. పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా గురువారం స్థానిక విద్యాశాఖాధికారి కార్యాలయంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మగౌరవాన్ని చాటిచెప్పిన గొప్ప మహనీయుడు పొట్టిశ్రీరాములు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు ముత్యాల దయాకర్, జె.పెంచలరావు, టి.వెంకటసురేష్, సిబ్బంది గూడూరు విజయమ్మ, పందిటి మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో..

ముత్తుకూరు: వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ముత్తుకూరులో అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వీరాంజనేయస్వామి ఆలయం వద్ద పొట్టిశ్రీరాములు చిత్రపటానికి వాసవి క్లబ్ ప్రతినిధులు పూలమాల వేసి నివాళులర్పించారు. పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు చందా వెంకటేశ్వర్లు, కార్యదర్శి కనిశెట్టి సుబ్బయ్య, కోశాధికారి చెక్కా శ్రీనివాసులు, క్లబ్ ప్రతినిధులు చెక్కా సుధాకర్, పైడా వెంకటేశ్వర్లు, సాల్లేటి కొండయ్య, తటవర్తి సుబ్బారావు పాల్గొన్నారు. అలాగే ముత్తుకూరు హైస్కూల్‌లో హెచ్ఎం చెంచురామయ్య ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

త్యాగధనుడు అమరజీవి

తోటపల్లిగూడూరు: ఆంధ్ర రాష్ట్ర సాధకుడు, అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగధనుడని సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం సుభాషిణి పేర్కొన్నారు. మండలంలోని సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

పొదలకూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను గురువారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాచపూటి రామలింగయ్య, ఆమర్తలూరు చెంచయ్య, పొట్టి సుధాకర్, అనిశెట్టి సుబ్బారావు, రాచపూటి ధనుంజయరావు, దామిశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

మనుబోలు: పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పొట్టిశ్రీరాములు చిత్రపటానికి ఎంపీడీఓ వెంకటేశ్వర్లు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ తెలుగు మాట్లాడే వారందరికీ ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలని తపించి, అందుకోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు వారందరికీ ఆరాధ్యుడని కొనియాడారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రమణయ్య, ఏపీఓ రాజమ్మ, సీనియర్ అసిస్టెంట్ అరుణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కేవీఆర్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

జయంతి వేడుకలు

ఇందుకూరుపేట: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కల్పన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పొట్టిశ్రీరాములు చిత్రపటానికి ఎంపీడీఓ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఉషారాణి, సీనియర్ అసిస్టెంట్ పవన్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో డీటీ బషీర్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ జీవన్‌కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు. పల్లిపాడులోని గాంధీ ఆశ్రమంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి, గాంధీజీ, పొనకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆశ్రమ కోర్ కమిటీ సభ్యులు గంపల మంజుల, ఉపాధ్యాయిని రేవతి, విద్యార్థులు పాల్గొన్నారు.


కొడవలూరు: పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈఓ తదితరులు


ముత్తుకూరు: వాసవి క్లబ్ ఆధ్వర్యంలో..


పొదలకూరు: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..


మనుబోలు: మండల పరిషత్ కార్యాలయంలో..

యాపిల్ వాచ్ విషయమై దాడి

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిపై దాడి చేసిన వారిపై బాలాజీనగర్ పోలీసులు కేసును గురువారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఇస్కాన్ సిటీలోని ఇందిరానగర్‌కు చెందిన బిల్డర్ వెంకటకృష్ణ, వెంకట్రామపురానికి చెందిన ప్రసాద్ నాయుడు స్నేహితులు. వెంకటకృష్ణ చేతికున్న యాపిల్ వాచ్‌ను చూసిస్తానని ప్రసాద్‌నాయుడు ఇటీవల తీసుకున్నారు. వాచ్ విషయాన్ని మరిచిన వెంకటకృష్ణ ఇంటికెళ్లిపోయారు. ఈ విషయమై ప్రసాద్‌నాయుడికి ఫోన్ చేయగా, లిఫ్ట్ చేయలేదు. దీంతో స్నేహితుడి ఇంటి వద్దకు వెంకటకృష్ణ మంగళవారం రాత్రి వెళ్లారు. వాచ్ విషయమై ప్రశ్నించగా, ప్రసాద్‌నాయుడు, హనుమంతరావు, కార్తీక్ రెడ్డి, తదితరులు దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై మహబూబ్ సుభానీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దాస్పత్రికి వైద్య పరికరాల వితరణ

నెల్లూరు (అర్బన్): దర్గామిట్టలోని పెద్దాస్పత్రిలో సెలైన్లను ఏర్పాటు చేసుకునేందుకు గానూ పలు స్టాండ్లను ప్రియదర్శిని మహిళా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ కన్వీనర్ లక్ష్మీసునంద మాట్లాడారు. పెద్దాస్పత్రికి బీపీ ఆపరేటర్లు, స్ట్రెచ్చర్లు, వీల్ చైర్లు, తదితర పరికరాలను ప్రియదర్శిని మహిళా లయన్స్ క్లబ్ సభ్యులు ఇప్పటికే అందజేశారని కొనియాడారు. లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి అఖిలారెడ్డి, ఆస్పత్రి ఆర్ఎంఓ కళారాణి, డాక్టర్లు సుబ్రహ్మణ్యం, అరుణ్‌కాంత్, సతీష్, సుశీల్, తదితరులు పాల్గొన్నారు.